
# సొంత ఇల్లు



"మీరు వెయ్యి చెప్పండి... లక్షచెప్పండి... మనకు ఓ ఇల్లు వుండి తీరవల్సిందే" అంది రుక్మిణి ఖచ్చితంగా.

"ఈ రోజుల్లో ఇల్లు కట్టటం అంటే మాటలు కాదు. అన్ని ఖరీదులు పెరిగిపోతున్నాయి. అయినా సొంత ఇల్లంటే ఎన్నో నమస్యలు వుంటాయి" అన్నాడు గోపాలరావు

"ఈ అద్దె కొంపలో ఎన్ని అగచాట్లు పడుతున్నామో చూస్తున్నాంగా. మనకంటూ ఓ గూడుంటే తిన్నా—తినక పోయినా అందులోపడి వుండచ్చు. లేచిన వేళుంటుంది. లేవని వేళుంటుంది. ఎక్కడ ఏం చేసినా మనదన్న కొంప వుంటే నిశ్చింత."

"చూడు రుక్మిణీ! నీ మాట నిజమే అనుకో. కానీ మన దగ్గరంత డబ్బు ఎక్కడిది చెప్పు? వున్న డబ్బుతో దిగామా అది ఎటూచాలదు. పోనీ, మన అబ్బాయిలకి రాద్దామా అంటే వాళ్ళు పంపుతారన్న ఆశ నాకేం లేదు" అన్నాడాయన.

"నా ఒంటిమీద నగలమ్మి అయినా సరే మనం ఇల్లు కట్టుకుందాం. మనకి తగ్గట్టుగా తక్కువలోనే కట్టుకుందాం. కాస్తో కూస్తో కావలసి వస్తే అబ్బాయిలకి రాస్తాను. ఆ మాత్రం అయినా ఇవ్వరంటారా? ఇన్నాళ్ళ మన కాపురంలో నేనుగా మిమ్మల్ని అడిగిన ఏకైక కోరిక ఇదేనండీ. రేపు నేను పోతే వీధిలో పడేసే దుర్గతి నాకు పట్టనీయకండీ" అందావిడ దీనంగా.

"రుక్మిణీ!" బాధగా చూశాడు గోపాలరావు భార్యవంక.

నగటు స్త్రీలకు బంగారమంటే పంచప్రాణాలు. పైగా అవి తన భార్య పుట్టింటివాళ్ళు పెట్టినవి. తన నగలమ్మి అయినా ఓ గూడు ఏర్పరుచుకుందాం అనే భార్య మాట ఎలా కాదనకలడు? భార్య మాటలు వింటున్న ఆయనకు సొంత ఇల్లంటే ఆమెకు ఎంతమక్కువో బాగా అర్థమయింది.

అందుకే భార్య కోరిక మేరకు మంచి స్థలం చూసి ఓ రెండు వందల గజాలు తీసుకున్నాడు.

శంకుస్థాపనకు రమ్మని రాసిన కొడుకుల వద్దనుంచి ఒకే రోజు జాబులు వచ్చాయి.

పెద్దకొడుకు సెలవులేదని—చిన్నకొడుకు మావగారి షష్ఠిపూర్తికి వెళ్ళాలని. మనసులోని వెలితిని పూడ్చుకుని పైకి ఆనందం నటిస్తూ శంకుస్థాపన చేశారా భార్యా

"మూర్ఖులు ఇళ్లు కడితే, తెలివైన వాళ్లు ఆ ఇళ్లల్లో నివసిస్తారు!" అన్నాడు బెర్నార్డ్‌షా. జీవితంలో ఎంతో శ్రమ, కష్టనష్టాలు అనుభవించి ఓ గూడును నిర్మించేసరికి, ఆ ఫలాన్ని అనుభవించే సమయంలో వాళ్లకు కాలం చెల్లిపోవడం, తక్కినవాళ్లు దాన్ని అనుభవించడం చూసి—వ్యంగ్యంగా అన్న మాట అది! వ్యక్తులలో స్వార్థమే ప్రధానమై అనుబంధాలకు తావులేనప్పుడు ఎవరికోసం ఇల్లు నిర్మింపబడిందో వారికే ఆ ఇంట్లో స్థానం లేదని అన్నప్పుడు ఒక సాధువుకు కూడా ఆగ్రహం కలగడంలో ఆశ్చర్యం ఏముంది?

— మాడుగుల కృష్ణకుమారి

భర్తలు.

మర్నాడే పని మొదలయింది. సిమెంటు, ఇనుము, ఇసుక వచ్చాయి.

పగటిపూట భర్తను ఆఫీసుకు పంపగానే తను ఇల్లు కట్టించే స్థలానికి బయలుదేరేది రుక్మిణి.

దగ్గరుండి పనివాళ్ళచేత 'చెప్పిచేయించేది.

సొంతఇల్లు ఏర్పడుతోందన్న ఆనందం ముందు తను పడుతున్న శ్రమ పెద్దగా లెఖ్ఖనిపించలేదామెకు.

ఒంటిమీద నగలమ్ముతున్నప్పుడు ఒక్క క్షణం మనసు చివుక్కు మన్పించినా అందమయిన ఆ చిన్నిపాటి ఇల్లు మనోహరంగా కళ్ళముందు కదలాడ టంతో ఆ బాధను మర్చిపో గలిగింది.

శ్లాబ్ వడ్డ రోజు నగం తృప్తి చెందింది.

రెండేసి గదుల చొప్పున రెండు వాటాల ఇల్లు, చుట్టురా కాంపౌండు గోడ. ముందుగా చిన్నపాటి గార్డెన్. గార్డెన్‌లో ఏ మొక్కలు ఎలా పెంచాలో వూహించుకుని మురిసిపోసాగిందావిడ.

"ఏమిటో రుక్మిణీ! ముఖమంతా పీక్కుపోయి బాగా నల్లబడ్డావు. ఎండనక వాననక ఆ ఇంటి కోసం శ్రమిస్తు న్నావు" అన్నాడు గోపాలరావు బాధగా భార్యతో.

"కష్టపడితేనేనండీ సుఖం దక్కేది. అన్నట్లు కలవ తెప్పించాలన్నారు. మరి డబ్బు?" పూర్తి చేయలేక మధ్యలో ఆపేసింది.

"అనుకున్న దానికిప్పటికే రెట్టింపు అయింది. ఆఫీసులో లోన్ కూడా తెచ్చాను. వున్న పళాన పదివేలంటే మాటలా రుక్మిణీ. అప్పుచెయ్యటం నా అభిమతానికి విరుద్ధం" అన్నాడాయన బరువుగా.

"పోనీ అబ్బాయిలకి రాస్తేనో" అంది రుక్మిణి ఆశగా.

"పిచ్చిదానా, వాళ్లు మొన్ననే రాశారు కదటే. పెద్దాడు సిటీలో అపార్ట్‌మెంటు తీసుకుంటాడట. చిన్నాడు ఆఫీసు కోలనీలో ఇల్లు కడతాడట. అంటే మా దగ్గర డబ్బులున్నా యివ్వం అని పరోక్షంగా చెప్పటం అన్న మాట. పైగా, మీరు ఎప్పటికయినా మా దగ్గరకు చేరవలసిందే కదా మళ్లీ ప్రత్యేకంగా మీకా ఇల్లు ఎందుకు? అని రాశారు. మర్చిపోయావా? వాళ్ళ మాటల ప్రకారం ఈ ఇంటిమీద వాళ్ళకి ఆశలేదులా వుంది." అన్నాడాయన.

ఆఖరిసారిగా తన చేతులకున్న జత గాజులు, మంగళసూత్రం తాడు తీసి భర్త కిచ్చింది రుక్మిణి.

పసుపుతాడుతో వున్న భార్యను చూసి కళ్ల నీళ్లు గిర్రున తిరిగాయి ఆయనకు. "బాధపడకండి. ముందు పని జరగటం ముఖ్యం" అందావిడ భర్త భుజాన చెయ్యివేసి ఓదార్పుగా.

మరో నెల రోజులకల్లా మొత్తం పనులు పూర్తయినా యి—సున్నాలతో సహా కొత్తింటికి.

రుక్మిణి ఆనందానికి అవధులు లేవు.

గృహప్రవేశం ముహూర్తం నిర్ణయించి కావలసిన వాళ్లు అందరికీ శుభలేఖలు పంపారు.

గోపాలరావు కొడుకులిద్దరు భార్యా, పిల్లలతో దిగారు.

మర్నాడే గృహప్రవేశం.

"రుక్మిణీ! మొత్తానికి అన్నమాట నెరవేర్చుకున్నావు. సొంత ఇంటియజమానురాలివయ్యావు" అన్నాడు హాస్యంగా గోపాలరావు భార్యని.

"అదేమిటండీ మీరు మాత్రం యజమానికారా?" అందావిడ చిరునవ్వుతో.

"కష్టపడి దగ్గరుండి కట్టించుకున్నావేయ్. ఆ క్రెడిటంతా నీదే."

"నిజమేనండీ. ఈరోజు వస్తుందని కలలోకూడా అనుకోలేదు." అందావిడ తృప్తిగా.

మరికాసేపు భర్తతో కబుర్లు చెప్పి నిద్రలోకి జారుకుంది. భార్య బోసిమెడ చూస్తుంటే బాధగా అన్పించిందాయనకు

రిటైర్ అవగానే వచ్చిన డబ్బుతో భార్యకో జతగాజులు, సూత్రాల గొలుసు కొనాలని నిర్ణయించుకున్నాడు.

నిద్రలో కూడా మర్నాటి వేడుకలు తల్చుకుని కాబోలు చిన్నగా నవ్వుకుంటోంది రుక్మిణి.

ప్రేమగా భార్య శిరస్సు నిమిరాడు గోపాలరావు.

తను అనుకున్న కోరిక తీరిందన్న అమితమయిన ఆనందంతో రాత్రివేళ నిద్రలోనే ఆగిపోయింది రుక్మిణి గుండె.

తెల్లవారి అందరూ ఘొల్లుమన్నారు.

చెక్కుచెదరని చిరునవ్వుతో వున్న భార్య ముఖాన్ని చూస్తుంటే జరిగింది నమ్మబుద్ధి కావటం లేదు గోపాలరావుకి.

పైకి భోరున ఏడ్వకపోయినా భార్య మరణం తాలూకు బాధ ఆయన గుండెల్ని తవ్వేస్తోంది

"నాన్నా! ఇంటివాళ్ళు అమ్మని బయటపడుకో పెట్టమంటున్నారు" అన్నాడు పెద్దకొడుకు వచ్చి.

"సైడు కాలువ పక్కనా?" అన్నారాయన.

"పైన కావాలంటే ఓ చెక్కవేద్దాం." అని సలహా యిచ్చాడు చిన్న కొడుకు.

"ఒరేయ్! మీ అమ్మను వీధిలో పడుకో బెట్టే ఖర్మేంలేదురా. కొత్తింటికి తీసుకు వెడదాం" అన్నారాయన దుఃఖం నుంచి తేరుకుని.

తండ్రి మాటలకు ముఖాలు చూసుకున్నారు కొడుకులిద్దరు.

"శుభమా అని గృహప్రవేశం అవకుండా శవాన్ని"—నీళ్ళు నమిలాడు పెద్ద కొడుకు.

"నిజమే మొదటిసారిగా శవం వెళ్లిన కొంప అని ఎవరైనా అద్దెకు వస్తారా?" చిన్న కొడుకు సందేహాన్ని వెలిబుచ్చాడు.

"మావగార్కి అత్తగారు పోయాక మతి భ్రమించింది లావుంది. లేకపోతే శుభమా అని మనుమలు గృహప్రవేశం చేసే కొంపలో శవాన్ని గృహప్రవేశం చేయించటమా?" బిగ్గరగానే అన్నారు కోడళ్ళిద్దరూ.

"రేపు నేను పోతే వీధిలో పడేసే దుర్గతి నాకు పట్టనీయకండి" అని దీనంగా అన్న భార్య మాటలే మనసులో మెదిలాయి గోపాలరావుకి.

"ఆపండి!" బిగ్గరగా అరిచాడాయన.

"ఒరేయ్! మీరట్రా కొడుకులు? రాత్రిదాకా వూపిరి వున్నమనిషి, వూపిరిపోగానే తెల్లవారి శవమయిందట్రా మీకు? ఆ మాటనడానికి మీకు నోరెలా వచ్చిందిరా? నా భార్య తన నగలమ్మి శ్రమకోర్చి కట్టించుకుందా యింటిని. ఆమె అంతిమ యాత్ర ఆ కొత్తింటి దగ్గర్నుంచి బయలు దేరవల్సిందే. అదే ఆమెకు నిజమయిన ఆత్మశాంతి" దుఃఖంతో అన్నాడాయన.

"బాగుంది! ముసలాయన వాలకం. పోయిన వాళ్ళని శవం అనక ఏమంటారు?" చాటుగా గొణుక్కున్నారు కోడళ్లిద్దరూ.

కొత్తింటికి తల్లి శవం తీసుకెళ్ళరాదని అలా చేస్తే తను తలకొరివి పెట్టనని మొండికేశాడు పెద్దకొడుకు.

రెండోవాడు అన్నగారిని సమర్థించాడు.

"బ్రతికున్నన్నాళ్ళు మీ మాటలతో, చేష్టలతో మీ అమ్మ మనసుని ఏనాడో కాల్చేశారురా. అలాంటి మీ చేతుల మీద మీ అమ్మ దహనం అవుతుందనటం మీ అవివేకంరా." అన్నాడాయన ఆవేశంగా.

ఆయన కోర్కెమీద స్నేహితులు తెచ్చిన కార్లో రుక్మిణి భౌతికకాయం తన స్వంత ఇంటికి బయలుదేరింది.

సరిగ్గా ముహూర్తం టైముకే ఆవిడ గృహప్రవేశం చేసింది. మధ్యగదిలో చాపమీద పడుకోపెట్టిన భార్య పక్కనే కూలబడ్డాడు గోపాలరావు.

నలుగురు బంధువులూ నచ్చచెప్పడంతో తప్పనిసరిగా కర్మకాండకు దిగారు కొడుకులిద్దరూ.

పోయాక శవానికి చేయించే స్నానానికి నీళ్ళు, పడుకునేందుకు బారెడు నేల అవే రుణంగా మిగిలాయి రుక్మిణికి ఆ ఇంటి నుంచి. పసుపు కుంకుమలతో సుమంగళిగా తాను కోరుకున్న విధంగా ఆమె అంతిమ యాత్ర తాను కోరి కట్టించుకున్న స్వగృహం నుంచి బయలుదేరింది.

భార్య కోరిక ఈ విధంగా తీరుతుందని వూహించని గోపాలరావు కళ్ళు కన్నీళ్ళతో సెలయేళ్ళయినాయి.

పన్నెండు రోజులు గృహప్రవేశానికి వచ్చిన బంధుమిత్రులతో, ఆ శుభకార్యానికి తెచ్చిన సరుకులన్నీ—ఈ అశుభకార్యానికి పూర్తిగా సరిపోయాయి.

కర్మచేయించిన బ్రాహ్మడితో కొడుకులిద్దరు—

తల్లి శవాన్ని మొదటిసారిగా కొత్తింటికి తెచ్చిన దోషం పోవాలంటే ఏం చెయ్యాలో చెయ్యమని ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదని చెపుతున్నారు.

"అవును మరి... ముందు ముందు పిల్లా పాపలతో వుండేది మనం. ఈ కీడు పోవాలంటే గట్టిగా చేయించండి" కోడళ్లిద్దరూ చెప్పారు.

అన్ని మాటలూ చెవిన పడనే పడ్డాయి గోపాలరావుకి.

వీళ్లు ఒక్కపైసా ఇవ్వకపోయినా వాళ్ళమ్మపోయాక ఆమె శవాన్నే ఆమె ఇంటికి రానియ్యని కొడుకులు రేపే తనకేదన్నా అయితే—

ఈ రోజు తన భార్యకి తనున్నాడు కాబట్టి ఆమెకీపాటి సంతృప్తి అయినా దక్కనిచ్చాడు. రేపు తను పోతే....

అందుకే బాగా ఆలోచించిన మీదట ఆయన—

"చూడండి శాస్త్రిగారూ! నా భార్య పేరిట ఈ ఇంటిని వృద్ధుల సంరక్షక గృహంగా రాసివ్వాలనుకుంటున్నాను. పాపం వాళ్ళేదో శాంతి చేయించాలనుకుంటున్నారు... అనవసరపు ఖర్చు అని చెప్పండి" అన్నారు.

కొడుకులు + కోడళ్ళ ముఖాలు పాలిపోయాయి.

ఆత్మలనేవి వుంటే పంచభూతాల్లో కలిసిపోయిన రుక్మిణి ఆత్మమాత్రం భర్త నిర్ణయానికి తప్పక హర్షించి వుంటుంది!